సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



యమపాశాలు

కేబుల్ వైర్లు ప్రజల పాలిట యమపాశాలవుతున్నాయి. ఏ వైరు కిందికి వేలాడి మెడకు చుట్టుకోబోతుంతో తెలీడం లేదు. మొన్న కడపలో జరిగిన సంఘటనే ఇందుకు ఉదాహరణ.. -8లో



వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమాలు

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర. ధార్మిక సంస్థల ఆస్తుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ సయ్యద్ అహ్మద్‌బాషా పేర్కొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
38.6/28.6

వాతావరణం

జిల్లాలో గురువారం 28.6 - 38.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్



నిర్భయంగా విధులు.. అభయంతోనే మొదలు

తమ భద్రతకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలంటున్న మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులు

వైద్యులు భగవత్ స్వరూపులు. అలాంటి దైవానికే ఆపదొచ్చింది. వైద్యుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. మన గల్లీ మొదలు..ఢిల్లీ వీధుల దాకా వైద్యులపై.. ముఖ్యంగా దాక్టరమ్మలపై దాడులు జరుగుతున్నాయి. మొన్న కోల్‌కతాలో మహిళా పీజీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన మానవ సమాజానికే ఓ మాయని మచ్చలా మారింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనపై యావత్ భారతం విస్తుపోయి చూసింది. ఈ నేపథ్యంలో మన జిల్లాలో మహిళా వైద్యులకు రక్షణ ఉందా..పని ప్రదేశంలో వారి భద్రత బాగుందా.. గాలిలో దీపంలా మారిందా.. దుష్ట చూపులేమైనా వెంటాడుతున్నాయా.. అసలు వారు ఏం కోరుకుంటున్నారనే విషయాలపై సాక్షి ప్రత్యేక కథనం.



కడప రిమ్స్‌లో ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్స్, వైద్య విద్యార్థులు

259 రిమ్స్‌లో పని చేసే స్టాఫ్ నర్సులు
34 హెడ్ నర్సులు
500 - 600 వైద్యులు, వైద్య విద్యార్థినులు

కడప అర్బన్: మహిళలపై రోజురోజుకు జరుగుతున్న దాడులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా వారు పనులు చేసే ప్రదేశంలో సౌకర్యాలు కరువవడం.. భద్రత లేకపోవడం మరింత కలవరపాటుకు గురి చేస్తోంది. ఇటీవల కోల్‌కతాలో ఆర్‌జీకేఏఆర్ వైద్య కళాశాలలో మహిళా పీజీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనే ఇందుకు సాక్ష్యం. ఈ నేపథ్యంలో మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది భద్రతపై సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వాస్పత్రుల్లో పటిష్ట నిఘాతో పాటు సమస్యలను నిర్భయంగా ఫిర్యాదు చేసే వీలుండాలని స్పష్టం చేసింది.

జిల్లా ఆస్పత్రుల్లోనూ భయంభయంగానే విధులు..

జిల్లాలోని కడప రిమ్స్, ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రిలోనూ వైద్య సిబ్బంది భయంభయంగానే విధులు నిర్వర్తిస్తున్న పరిస్థితి ఉంది. ఇక నైట్ షిఫ్ట్‌లో పనిచేసే సిబ్బంది కడప శివార్లలోని రిమ్స్ నుంచి నగరంలోకి రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. సుమారు ఐదారు కిలోమీటర్లు ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉంటుంది. ఇక్కడ పోలీసు పహారా 24 గంటలు పెట్టాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రొద్దుటూరు, కడప ఆస్పత్రుల ఆవరణలో రాత్రిపూట మందుబాబుల రచ్చ ఎక్కువైందని నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరా నిఘా తప్పనిసరిగా ఉండాలని కోరుతున్నారు. అలాగే సెక్యూరిటీ మరింత పెంచాలని కోరుతున్నారు. ఇక ఫిర్యాదు కమిటీల్లో పోలీసు, న్యాయశాఖకు చోటివ్వాలని వైద్య విద్యార్థినులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

కడప అర్బన్: కోల్‌కతాలోని ఆర్‌జీకేఏఆర్ వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్యా ఘటనపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల, ఆసుపత్రి ఆవరణంలో 10వ రోజున ఆందోళన ఉధృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం చేపట్టిన రిలేదీక్షలు నాలుగవరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, పరిపాలన విభాగం అధికారులు, వైద్య సిబ్బంది జూడాల ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కడప రిమ్స్ గైనకాలజీ విభాగం హెచ్ఓడి డాక్టర్ లక్ష్మీసుశీల, డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, డాక్టర్ రబ్బానీబేగం మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పనిచేస్తున్న ప్రదేశంలో మొదటగా తామంతట తాముగా ఆత్మరక్షణకు వెనుకాడకూడదన్నారు. ప్రతి వైద్య సిబ్బంది ఒకరికొకరు సహాయం చేసుకోవాలన్నారు. నాలుగవ రోజున రిలే నిరాహార దీక్షల్లో పరిపాలన విభాగం ఆఫీస్ సూపరింటెండెంట్ ఎస్.ఎం. సునీత, పీజీ వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, దీపక్, ఎలాక్యియ, మానస, దీప్తి, భవ్య, పూజ, వైద్య విద్యార్థులు అర్చన, చందన, వర్షిత, మౌనిక, చందుశ్రీ, రాహుల్, బాలాజీ, ప్రతాప్ తదితరులు కూర్చున్నారు.



గ్రీవెన్స్ కమిటీలో సభ్యులుగా చేర్చాలి

ఆస్పత్రిలో నియమించే గ్రీవెన్స్ కమిటీలో సీనియర్ డాక్టర్స్‌తో పాటు, పోలీసులను, లాయర్స్‌ను కూడా సభ్యులుగా చేరిస్తేనే మహిళా వైద్యులు, వైద్య విద్యార్థులు తమ సమస్యలను తెలియజేయగలుగుతారు. కడప రిమ్స్ మార్గమధ్యంలో పోలీస్ పెట్రోలింగ్ నడిపించాలి. వైద్య సిబ్బందికి ప్రత్యేకంగా రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలి.
– సునీత, ఆఫీస్ సూపరింటెండెంట్, రిమ్స్



అనుచితంగా ప్రవర్తిస్తుంటారు

ఐపీ విభాగాలలో పేషెంట్లు చికిత్స పొందుతున్న సమయంలో వారి సహాయకులలో కొందరు అనుచితంగా ప్రవర్తిస్తుంటారు. కొన్ని సమయాలలో ఎదుర్కోలేక పోతున్నాం. అలాంటి వారిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాలి. ఐపీ విభాగాలలో సెక్యూరిటీ విభాగం వారు పటిష్టంగా విధులను నిర్వహించాలి. – డాక్టర్ దీప్తి, పీడియాట్రిక్ పీజీ వైద్య విద్యార్థిని, రిమ్స్, కడప



వ్యక్తిగత భద్రతపై దృష్టి పెట్టాలి

ప్రతి వార్డులో విధులను నిర్వహించే వైద్యురాలు తాము వ్యక్తిగత భద్రతపై దృష్టి పెట్టాలి. గైనకాలజీ విభాగంలో భద్రతా ప్రమాణాలతో కూడిన రక్షణ సిబ్బందిని నియమించాలి. మహిళా పేషెంట్ల సహాయకులు ఎవరైనా సరే వైద్య సిబ్బంది జోలికి రాకుండా చూడాలి. మహిళల ప్రత్యేక వార్డు అనీ ఎన్నిసార్లు చెప్పినా వినకుండా గొడవలు చేస్తుంటారు.
– డాక్టర్ లక్ష్మీసుశీల, హెచ్ఓడి, గైనకాలజీ, రిమ్స్, కడప



పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నాం

రిమ్స్ ఆవరణంలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఉన్నతాధికారులతో మాట్లాడి పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నాం. సీసీకెమెరాలను ఏర్పాటు చేశాం. ఐపీ విభాగంలో పేషెంట్ల కోసం వచ్చేవారిని అనుమతించేందుకు అటెండర్స్ పాస్‌లను ఇవ్వనున్నాం. – డాక్టర్ జీ.వి.రమాదేవి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల(రిమ్స్)



ప్రత్యేక సౌకర్యాలను కల్పించాలి

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు, ఇతర వైద్య సిబ్బందికి ప్రత్యేకంగా టాయిలెట్స్, డ్రెస్ ఛేంజింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలి. టాయిలెట్స్ గానీ, పేషెంట్స్ షిఫ్టింగ్ సమయంలో వైద్య సహాయక సిబ్బంది తోడుగా వెళ్లాలి. రాత్రి వేళల్లో విధులకు వచ్చేటపుడు పోలీసుల రక్షణ అవసరం. – భార్గవి, స్టాఫ్ నర్సు, రిమ్స్, కడప



వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ

రిమ్స్ ఐపీ విభాగంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది ఎక్కడికైనా వెళ్లేటపుడు తోడుగా వెళ్లాలి. సెక్యూరిటీ వారు అప్రమత్తంగా వుండాలి. భద్రతను మెరుగుపరిస్తే బాగుంటుంది. నైట్ డ్యూటీలను నిర్వహించే వైద్య సిబ్బందికి ప్రత్యేకంగా రక్షణ కల్పించాలి.
– పి. మాధురీలత, నర్సింగ్ సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్), కడప

మాకు సెక్యూరిటీ లేదు!

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి పేషెంట్లతో ఎప్పుడూ కిటకిటలాడుతుంటుంది. ఓపీ కోసం రోజూ వేల మంది వస్తుంటారు. వందల మంది అడ్మిట్ అవుతుంటారు. ఇక ఆస్పత్రిలో మహిళా డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఇతర ఉద్యోగులకు విశ్రాంతి గదులు, వాష్ రూమ్‌లు వంటి సౌకర్యాలున్నా సెక్యూరిటీ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. రాత్రి సమయాల్లో భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరు వస్తున్నారో తెలియదు..

జిల్లా ఆస్పత్రిలో గైనకాలజిస్టులతో పాటు నర్సులు, వారికి సహాయకులుగా ఎఫ్ఎన్ఓలు ఉన్నారు. వీరు మూడు షిఫ్టుల్లో పని చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం షిఫ్టుల్లో సమస్య లేదని, రాత్రి డ్యూటీలో మాత్రం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు నర్సింగ్ సిబ్బంది చెబుతున్నారు. ముఖ్యంగా బయటి వ్యక్తులు రాత్రి సమయాల్లో మద్యం తాగి ఆస్పత్రిలోకి వచ్చి పడుకుంటున్నారని నర్సులు వాపోతున్నారు. సెక్యూరిటీ సిబ్బందికి చెబితే.. భయంతో వారు కూడా రాలేని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఆస్పత్రిలో రాత్రి వేళల్లో మద్యం తాగొచ్చిన వ్యక్తులతో గొడవ పడిన ఘటనలు అనేకం ఉన్నాయని, చాలా మంది తమపై దాడులు కూడా చేశారన్నారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ కట్టుదిట్టం చేస్తే అంతేచాలని నర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు.

1100 ప్రతి రోజూ ఓపీ సంఖ్య..
200 అడ్మిట్ వారి సంఖ్య..
51 నర్సులు
43 సెక్యూరిటీ గార్డులు



జిల్లా ప్రభుత్వాసుపత్రి, ప్రొద్దుటూరు



సెక్యూరిటీ కట్టుదిట్టంగా ఉండాలి

సెక్యూరిటీ వ్యవస్థ ఆస్పత్రిలో కట్టుదిట్టంగా ఉండాలి. ఇది మా కోసం కాదు. వార్డుల్లో మహిళలు, చిన్న పిల్లలు ఉంటారు. అందరి రక్షణ కోసం సెక్యూరిటీ ఉపయోగపడుతుంది. మద్యం మత్తులో పేషెంట్ల సహాయకులు ఎన్నో సార్లు మాపై గొడవకు దిగిన సంఘటనలు ఉన్నాయి. రాత్రి వేళల్లో ఏదైనా జరగరానిది జరిగితే అప్పుడు ఏం చేయాలి.
– రాణెమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి, ప్రొద్దుటూరు



భద్రత లేకుంటే ఎలా పని చేయాలి

ఆస్పత్రిలో మాకు అన్ని సదుపాయాలు ఉన్నాయి. అయితే రాత్రి సమయాల్లో గతంలో జరిగిన కొన్ని ఘటనలను దృష్టిలో ఉంచుకొని భద్రతపై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం. ఆస్పత్రిలో ఏదైనా గొడవ జరిగితే తమకేమైనా అవుతుందేమోననే భయంతో సెక్యూరిటీ గార్డులు కూడా దగ్గరికి రాలేని పరిస్థితి ఉంది. రాత్రి వేళ పోలీసు భద్రతను కల్పిస్తే అందరికీ ధైర్యంగా ఉంటుంది.
– సంధ్యారాణి, హెడ్‌నర్సు, జిల్లా ఆస్పత్రి, ప్రొద్దుటూరు.

న్యూస్‌రీల్

వర్క్‌షాప్ బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ఆంగ్లశాఖ అధ్యాపకులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లాలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఆంగ్ల భాషలో బోధన నైపుణ్యాల మీద వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కార్యశాల సమన్వయకర్త డాక్టర్ జయంత్ కశ్యప్ తెలిపారు. వైవీయూలోని ఆర్ట్స్‌బ్లాక్‌లో జరిగే ఈ కార్యశాలకు సంబంధించిన బ్రోచర్ ను ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య కె. గంగయ్య, ఆంగ్లశాఖ విభాగాధిపతి ఆచార్య డా. జె. మెర్సీవిజేత, కార్యశాల సమున్వయకర్త డా. జయంత కశ్యప్, అకెడెమిక్ కన్సల్టెంట్ పి. చిట్టిబాబు, డా. వై. హరిబాబు పాల్గొన్నారు.

రేపటి నుంచి అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాలు వేదికగా ఈనెల 24 నుంచి సెప్టెంబర్ 11వ తేదీ వరకు ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. కర్నూలు, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. టోర్నీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు తెలిపారు. 24 వ తేదీ వైఎస్ఆర్ఆర్-ఏసీఏ వేదికగా కర్నూలు, నెల్లూరు జట్లు, కేఎస్ఆర్ఎం/కేఓఆర్ఎం మైదానం వేదికగా కడప, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్‌తో టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు.

కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

మను పాలిటెక్నిక్ ఇండక్షన్ ప్రోగ్రాంలో ఎయిమ్ అకాడమి ఎండీ

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఎయిమ్ అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ అహ్మద్‌బాషా పేర్కొన్నారు. గురువారం కడపలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎయిమ్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ అహ్మద్ బాషా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన ఉన్నతంగా ఉండాలన్నారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీని వాడుకుని ఒక మంచి ఇంజినీర్ కావాలన్నారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ మిర్జా విలయత్ అలీ బైగ్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఓటమి చూసి ఎవరు భయపడకూడదని దాన్ని నుంచి మరిన్ని విషయాలు నేర్చుకోవాలని వివరించారు. అధ్యాపకులు డాక్టర్ హకీముద్దీన్, మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, మొహమ్మద్ సికందర్ హుస్సేన్, టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్,విద్యార్థులు పాల్గొన్నారు.



సమవేశంలో మాట్లాడుతున్న ఎయిమ్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ అహ్మద్ బాషా

4 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లలో 30 రోజులు, జ్యూట్ బ్యాగుల తయారీకి 13 రోజులు శిక్షణ ఇస్తామని సంస్థ మేనేజర్ ఎం.ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 4న శిక్షణ ఇవ్వనున్నామని, 18–45 ఏళ్ల లోపు కలిగిన నిరుద్యోగ మహిళలు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల మహిళలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పశువులకు టీకా తప్పనిసరి

కడప అగ్రికల్చర్: ప్రతి రైతు తమ పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 20 నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్‌లో భాగంగా ఆమె గురువారం జిల్లాలోని పలు మండలాల్లో కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రతి రైతు తమ పశువులకు గాలికుంటు సోకకుండా ఉండేందుకు టీకా వేయించాలన్నారు. అలాగే 9 నెలలలోపు పేయి దూడలకు బ్రూసిల్లా టీకాను వేయించాలన్నారు. ఈ టీకాను వేయించడం వల్ల భవిష్యత్తులో దూడలకు ఈసుడు సమస్యరాదన్నారు. ఈ విషయంలో ప్రతి రైతు అప్రమత్తంగా ఉండి తమ పశువులకు టీకాలను వేయించాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య, పశువైద్యులు మారుతి ప్రసాద్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.



బాలుపల్లెలో టీకా గురించి రైతుకు వివరిస్తున్న పశుసంవర్థశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ

'ఇసుక పంపిణీ' పక్కాగా అమలు

- సచివాలయాల ద్వారా ఇసుక బుకింగ్
- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇసుక పంపిణీ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాల్లో జేసీ అదితిసింగ్‌తో కలిసి జిల్లాల్లో స్టాక్ యార్డ్‌ల వద్ద ఉన్న ఇసుక పంపిణీపై తహసీల్దార్లు, ఎంపీడీఓ, డిజిటల్ అసిస్టెంట్స్‌లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. జిల్లాలో మొత్తం 11 స్టాక్ పాయింట్లు ఉండగా అందులో 6 స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక పూర్తిగా అయిపోయిందన్నారు. మిగిలిన ఐదు స్టాక్ పాయింట్లలోని పగడాలపల్లి (పెండ్లిమర్రి మండలం) మండలం ఎర్రబెల్లి (వీ.ఎన్ పల్లిమండలం) కే వెంకటాపురం, పి అనంతపురం (కొండాపురం మండలం) జ్యోతి (సిద్దవటం మండలం) వద్ద 82422 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఇసుకను బుకింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కలెక్టరేట్లోని కంట్రోల్ రూమ్ ద్వారా కొంతమంది వినియోగదారులతో ఇసుక పంపిణీ విధానంపై ఫీడ్ బ్యాకులు సేకరిస్తామన్నారు.అక్రమంగా ఇసుక రవాణా చేసినా, ఇసుకను బ్లాక్ మార్కెట్ చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఇసుక రవాణా వాహనదారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మిగిలి ఉన్న ఐదు ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ప్రతి స్టాక్ పాయింట్ కు దాదాపు 20 వాహనాలు అవసరం పడతాయని అన్నారు. ప్రతి వాహనానికి ఒక యూనిక్ నెంబర్ అలాట్మెంట్ చేస్తామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, పక్కన ఎస్పీహర్షవర్ధన్‌రాజు

తగ్గిన కేసులు

జిల్లాలోని పెన్నా, చిత్రావతి, పాపాగ్ని నదుల ద్వారా ఇసుక రవాణా జరుగుతోందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. అక్రమ రవాణాపై తొలుత ఫిర్యాదులు అధికంగా వచ్చేవని, తాను తీసుకుంటున్న చర్యల వల్ల తగ్గాయని తెలిపారు. ఇప్పటికి 376 కేసులు నమోదు చేశామని, 185 వాహనాలు డీటైన్ చేసి రూ.22,26,000లు జరిమానా విధించామని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎంఎస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ లోపు ఓఏఎండీసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర సందేహాలకు 8985597928 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్ యార్డు వద్ద డౌన్ మెయిన్ లైన్ పట్టాలపై వెళుతున్న గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించిన లోకోపైలెట్ జగదీష్ రైలును ఆపి పరిశీలించగా.. రైలు ఢీకొనడంతో తలకు బలమైన రక్తగాయాలై మృతి చెందాడని అర్థమైందన్నారు. మృతుడు 5.2 అడుగుల ఎత్తు, తెల్లని, నల్లని తల వెంట్రుకలు, గడ్డం, నడుముకు రెండు పొరల ఎర్రని మొలతాడు ఉందన్నారు. మృతుడు బ్లూ, బ్లాక్, వైట్ చెక్స్‌గల ఫుల్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ఫ్యాంటు, హ్యాండ్‌మేడ్ కంపెనీ చెప్పులు ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు కడప రైల్వే పోలీసుస్టేషన్ ఎస్ఐ (సెల్ నెంబరు 94409 00811) లేదా కడప రైల్వే పోలీసు స్టేషన్ సీఐ (సెల్ నెంబరు 94406 27398)లో సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఆటోను ఢీకొన్న ట్యాంకర్

– పలువురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో బోల్తాపడిన ఆటో

అట్లూరు : కడప–బద్వేలు ప్రధాన రహదారిపై ఆటోను ట్యాంకర్ ఢీ కొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు అట్లూరు మండలం రెడ్డిపల్లి గ్రామంలో గురువారం జరిగిన గృహప్రవేశానికి బద్వేలుకు చెందిన బంధువులు హాజరయ్యారు. కార్యక్రమంలో ముగిసిన అనంతరం ఆటోలో బద్వేలుకు బయలుదేరారు. అదే ఆటోలో కొండూరు దగ్గర మరికొంత మంది ప్రయాణికులు ఎక్కారు. అయితే అట్లూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏపీ 39 టీటీ 9910 నంబరు గల హిందుస్తాన్ పెట్రోలియం ట్యాంకర్ ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటమ్మ, నాగమ్మ, సంటెమ్మ, తులసి, వైష్ణవి, విద్యాసాగర్‌తో పాటు పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యమపాశాలు

- ప్రాణాలు తీస్తున్న కేబుల్ వైర్లు
- మొన్న ఒక విద్యార్థిని బలిగొన్న వైనం




కడప అప్సర సర్కిల్‌లో విద్యుత్ స్తంభానికి కట్టలుగా చుట్టిన కేబుల్ వైర్లు

కడప కార్పొరేషన్ : కేబుల్ వైర్లు ప్రజల పాలిట యమపాశాలవుతున్నాయి. ఉరుకుల పరుగుల జీవితం.. ఆఫీసుకు, స్కూల్‌కు ఆలస్యమవుతుందేమోనని భావించి.. వేగంగా వెళ్తున్న సమయంలో కింద ఏ వైరు పడి ఉంది...పైన ఏ వైరు కిందికి వేలాడి మెడకు చుట్టుకోబోతుందని జనం అంచనా వేయలేకపోతున్నారు. మొన్న కడపలో జరిగిన సంఘటనే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.. అసలే పసిపిల్లలు.. సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి కేబుల్ వైర్లు చుట్టుకొని.. అవి విద్యుత్ వైర్లను తాకడంతో అభం శుభం తెలియని పసి ప్రాణం కడతేరిపోయింది. ఎంత నష్ట పరిహారం ఇచ్చినా.. ఏం చేసినా ఆ తల్లిదండ్రుల కడుపుకోత తీర్చడం ఎవరి తరం.

ఏ స్తంభానికి చూసినా కట్టలుగా వైర్లు

కడప నగరంలో ఏ స్తంభానికి చూసినా కట్టలుగా కేబుల్ వైర్లు వేలాడుతున్నాయి. అందులో ఏది విద్యుత్ వైరో.. ఏది కేబుల్ వైరో, ఏది సర్వీసు వైరో .. ఏ వైరు ఎటు పోతుందో తెలుసుకోవడం సాధ్యం కావడం లేదు. విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు కట్టకూడదు. అలా కట్టాలంటే విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కడపలో ఒక్క జియో నెట్‌వర్క్, సీపీసీ మినహా మరెవరూ విద్యుత్ శాఖ అనుమతి పొందలేదని అధికారులు చెబుతున్నారు. కేబుల్ ఆపరేటర్లు అనధికారికంగా, విద్యుత్ సిబ్బంది సమక్షంలో కాకుండా సొంతంగా వైర్లను లాగి స్తంభాలకు కట్టేస్తున్నారు. వైర్లను రోడ్ క్రాసింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఎన్‌జీవో కాలనీలో కేబుల్ వైరు కిందికి వేలాడుతుండటం వల్ల బైక్‌పై పోతున్న ఓ వ్యక్తి మెడకు చుట్టుకొని గొంతుకు బిగుసుకుపోయింది. ఇలా బహిర్గతం కాని సంఘటనలెన్నో జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ వైర్లకు కట్టిన కేబుల్ వైర్లను తొలగించాల్సిన విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతి పొంది విద్యుత్ లైన్లకు దూరంగా వైర్లను ఏర్పాటు చేయాల్సిన కేబుల్ ఆపరేటర్లు అంతే నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టి ఇలాంటి ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



శ్రీనివాస రెసిడెన్సీ ఎదురుగా ...

అది విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల జరిగిన ప్రమాదం కాదు

- డిష్ కేబుల్ నెట్‌వర్క్ వారి నిర్లక్ష్యం వల్ల జరిగింది
- విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లన్నీ తొలగిస్తున్నాం
- జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ



కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ఇంటర్నేషనల్ కల్యాణ మండపం వద్ద ఈనెల 21వ తేదీన జరిగిన ప్రమాదంలో విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం లేదని ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ తెలిపారు. గురువారం విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రమాదం జరిగిన తీరుపై సీసీ ఫుటేజీ వీడియోలు, ఫొటోలను ప్రదర్శించారు. అక్కడ తెగిపడింది విద్యుత్ వైర్లు కాదని, రోడ్ క్రాసింగ్ కేబుల్ వైర్ తెగి పడి ఉందన్నారు. ఇద్దరు విద్యార్థులు బుధవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటల ప్రాంతంలో సైకిల్‌పై బడికి వెళుతున్న క్రమంలో బళ్లారి రోడ్డు నుంచివారి స్కూలు వీధిలోకి మలుపు తిరిగే ప్రాంతంలో.. తెగిపడి చెట్టుపై నుంచి వేలాడుతూ రోడ్డు మీద ఉన్న డిష్ కేబుల్‌తో జత చేసిన జీఐ వైరు సైకిల్ వెనుక పై కూర్చున్న విద్యార్థి కాలికి తగిలిందన్నారు. అది చక్రాలలో ఇరుక్కుపోయి సైకిల్ అలానే ముందుకు ఈడ్చుకుపోవడం వల్ల డిష్ కేబుల్‌తో జత చేసిన జీఐ వైరు విద్యుత్ ప్రవహిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గల హెచ్‌జీ ఫ్యూజ్ సెట్ వద్ద 11 కె.వి లైన్‌కు తగలడం వల్లవిద్యుత్ ప్రసరణ జరిగి పిల్లలిద్దరూ విద్యుత్ ఘాతానికి గురయ్యారన్నారు. జరిగిన దానికి తాము చాలా చింతిస్తున్నామని, ఇది పూర్తిగా డిష్ కేబుల్ నెట్‌వర్క్ వారి నిర్లక్ష్యం వల్లే జరిగిందన్నారు. డిష్ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని లేఖ రాశామన్నారు. ప్రజల సహకారం లేనిదే విద్యుత్ ప్రమాదాలు నివారించలేమని, విద్యుత్తును భూతంలా చూసి, జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రమాదాలను అరికట్టుటకు వాట్సాప్ నంబర్ 9440814264 ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదకరంగా వాలిపోయిన విద్యుత్ స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు లైన్లు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటే ఫొటో తీసి, అడ్రస్ తెలిపి పై నంబర్‌కు వాట్సాప్ చేస్తే తమ సిబ్బంది స్పందిస్తారన్నారు. ఈ వాట్సాప్ నంబర్ వచ్చే ఫిర్యాదులపై కాల్ సెంటర్‌లో ఉండే వారిచే ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : ప్రేమించి పెళ్లి చేసుకున్న ప్రియురాలిని తల్లిదండ్రులతో పంపి తనకు అన్యాయం చేశారని మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. మదనపల్లె మండలం గంగన్నగారిపల్లెకు చెందిన రమణ కుమారుడు సోమశేఖర్(22) డిగ్రీ పూర్తి చేసి ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. తట్టివారిపల్లెకు చెందిన తమ బంధువుల అమ్మాయిని ప్రేమించి, పెద్దలను ఎదిరించి ఈనెల 7న తంబళ్లపల్లె సమీపంలోని ఓ గుడిలో వివాహం చేసుకున్నాడు. దీంతో యువతి తల్లిదండ్రులు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు రాజీ కుదిర్చి పదిరోజుల తర్వాత అందరి సమక్షంలో పెళ్లి చేస్తామని సోమశేఖర్‌ను ఒప్పించి అమ్మాయిని తల్లిదండ్రులతో పంపేశారు. అయితే అప్పటి నుంచీ యువతిని ఎవరికీ తెలియకుండా దాచి నిర్బంధించారు. చెప్పినట్లుగా పది రోజుల తర్వాత సోమశేఖర్ స్టేషన్‌కు వచ్చి తన భార్యను అప్పగించాలని కోరడంతో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, తనకు అన్యాయం చేస్తున్నారని భావించి ముందుగానే తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు ఆత్మహత్యాప్రయత్నాన్ని భగ్నం చేశారు. కుటుంబ సభ్యుల సహాయంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్సల నిమిత్తం పంపించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

జమ్మలమడుగు : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. జమ్మలమడుగు, మైలవరం, తలమంచిపట్నం పోలీస్‌స్టేషన్‌లను ఎస్పీ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి నిర్మూలించేందుకు ప్రతి పోలీసు అధికారి కృషి చేయాలని సూచించారు. పర్యాటక క్షేత్రం గండికోటను ప్రతిరోజు అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తుంటారని.. అందువల్ల గస్తీ పెంచాలని అర్బన్ సీఐ లింగప్పకు సూచించారు. నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా మున్సిపాలిటీ, పంచాయతీల అధికారులతో కలసి పనిచేయాలని తెలిపారు. మద్యపానాన్ని అరికడితే నేరాలు తగ్గుముఖం పట్టి పోలీసులపై ప్రజలల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. రాజకీయ నాయకులు, రౌడీషీటర్‌లపై నిఘా పెంచి శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి



తీవ్రంగా గాయ పడిన క్రిష్టయ్య

కమలాపురం : మద్యం మత్తులో కత్తితో దాడి చేసిన ఘటనలో మండలంలోని జంగంపల్లెకు చెందిన క్రిష్టయ్య తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం స్థానిక సీఎస్ఐ చర్చిలో వివాహ వేడుకలకు కొండాపురం మండలం పి.అనంతపురం గ్రామానికి చెందిన పలువురు కుటుంబ సభ్యులు హాజరయ్యారు. వారిలో గడ్డం రాజు, ఏసన్నలు కూడా ఉన్నారు. వీరు వరుసకు అన్నదమ్ములు. అయితే మద్యం మత్తులో ఉన్న ఏసన్న.. గడ్డం రాజు తండ్రిని హేళనగా మాట్లాడాడు. ఈ నేపథ్యంలో వారిరువురు ఘర్షణకు దిగారు. అది గమనించిన క్రిష్టయ్య వారిని వారించడానికి ప్రయత్నం చేశాడు. మద్యం మత్తులో ఉన్న ఏసన్న కత్తితో క్రిష్టయ్యను పొడిచాడు. ఈ ఘటనలో క్రిష్టయ్య తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో ఐదేళ్లు జైలు

కడప అర్బన్ : దాడి కేసులో నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ. 2000 జరిమానా విధిస్తూ గురువారం ప్రిన్సిపాల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.ప్రవీణ్‌కుమార్ తీర్పు వెల్లడించారు. పులివెందులకు చెందిన నల్లపురెడ్డి చెన్నకేశవరెడ్డి భూమిలో ఎస్.రామాంజనేయరెడ్డి పొట్టేలు మేపుకొంటూ వుండేవాడు. తమ పొలంలో పొట్టేలు మేపుకోవద్దని చెన్నకేశవరెడ్డి చెప్పాడు. దీంతో రామాంజనేయరెడ్డి 2017 జూలై 4న చెన్నకేశవరెడ్డిపై పులివెందులలో టీ–జంక్షన్ వద్ద దాడికి పాల్పడ్డారు. దీనిపై కోర్టులో చెన్నకేశవరెడ్డి మళ్లీ కేసు పెట్టారు. ఈ కేసు విచారణ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో గురువారం జరిగింది. ఫిర్యాదు దారుడైన చెన్నకేశవరెడ్డి తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యు.శేషయ్య వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తరువాత జడ్జి తీర్పును వెల్లడించారు. దాడికి పాల్పడిన రామాంజనేయరెడ్డికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

అదుపు తప్పిన స్కూల్ వ్యాన్

– రెండు బైకులు, మహిళను ఢీకొట్టిన వైనం

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ గురప్పగారిపల్లె వద్ద స్కూల్ వ్యాన్ అదుపు తప్పి రెండు బైకులు, మహిళను ఢీకొట్టింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన పోరుమామిళ్లకు చెందిన మహర్షి ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాన్‌గా తెలిసింది. ఘటనలో విద్యార్థులెవరికీ ప్రమాదం లేదని, స్వల్పగాయాలైన మహిళ పోరుమామిళ్ల ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నట్లు సమాచారం. బైకుల యజమానులతో పాఠశాల యాజమాన్యం చర్చలు జరిపి రాజీ అయినట్లు తెలిసింది. ఎస్ఐ కొండారెడ్డిని విచారణ చేయగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కలకడ : ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవులపల్లె పంచాయతీ హెచ్‌పీసీఎల్ గోడౌన్ సమీపంలో కడపకు చెందిన డి.తరుణ్ (25) కోన గ్రామానికి చెందిన అఖిల్‌రెడ్డి వద్ద జేసీబీ డ్రైవింగ్ నేర్చుకోవడానికి రెండు రోజుల క్రితం వచ్చాడు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంలో కోన గ్రామం నుంచి కలకడ వైపు వస్తూ హెచ్‌పీసీఎల్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ముళ్లపొదల్లో పడిపోయి మృతిచెందాడు. రోడ్డు పక్కన కావడంతో ఎవరూ గుర్తించలేపోయారు. సదరు తరుణ్ కోసం చుట్టుపక్కల విచారించగా ఎలాంటి ఆచూకీ తెలియలేదు. ఉదయం రోడ్డు మార్గంలో వెళ్లే వారు గుర్తించి మృతి చెందినట్లు తెలిపారు. వెంటనే కలకడ పోలీసులకు సమాచారం అందించారు. కడప సెంట్రల్‌జైల్ దగ్గర వికలాంగుల కాలనీలో నారాయణ కుమారుడు తరుణ్‌గా గుర్తించి, మృతుని అన్న డి.శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తరుణ్ మృతదేహాన్ని కలకడ మానవత స్వచ్ఛందసేవాసంస్థ సభ్యుల సహకారంతో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డెక్కిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు

సిద్ధవటం : సమస్యల పరిష్కారం కోసం ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, హెల్పర్‌లు రోడ్డెక్కారు. గురువారం డిపో మేనేజర్ మొండి వైఖరి నిరసనగా భాకరాపేట సమీపంలోని హెచ్‌పీసీఎల్ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్ డ్రైవర్లు, హెల్పర్‌ల యూనియన్ అధ్యక్షుడు షరీఫ్ హుస్సేన్ మాట్లాడుతూ డిపో మేనేజర్ తమతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని వాపోయారు. సమయపాలన పాటించడం లేదని, నోటీసు బోర్డులో టైమింగ్స్ పెట్టినా పట్టించుకోలేదని తెలిపారు. డ్రైవర్‌లకు భోజన సదుపాయం కూడా లేదని, కంపెనీలో క్యాంటీన్ పెట్టాలని నిబంధలున్నా అనుమతి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పనిబారంతో డ్రైవర్లు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించక నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్యాంకర్ డ్రైవర్‌లు, హెల్పర్లు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఆరుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ యుగంధర్

పీలేరు రూరల్ : దొంగతనం కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 19 గ్రాముల బంగారం, మూడు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు, ఆరు కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.యుగంధర్ తెలిపారు. ఆయన గురువారం వివరాలు విలేకరులకు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. అనంతపురం జిల్లా గుంతకల్లు డోణ ముక్కలకు చెందిన అంతర్ రాష్ట్ర దొంగలు సాగర్, అతని బావమరుదులైన సచిన్, శ్యామ్‌తోపాటు షేక్ అబ్దుల్ రహమాన్, సయ్యద్ మహమ్మద్ హుస్సేన్, సయ్యద్ సలీం, షేక్ మస్తాన్, సయ్యద్ రఫీ, సయ్యద్ హుస్సేన్‌బాషా గత నెల 23న రాత్రి 7.30 గంటలకు స్థానిక మదనపల్లె రోడ్డులో ఓ ఇంటిలోకి చొరబడి జహారాబి అను ఆమెపై దాడి చేసి, ఆమె వద్ద నుంచి బంగారు నగలు దోచుకెళ్లారు. అదే రోజు రాత్రి ఒంటిల్లుకు సమీపంలో నివాసం ఉన్న గిరిబాబు నాయుడు ఇంటిలోకి తుపాకులు, కత్తులతో దాడి చేసి పారిపోయినారు. 24న కర్ణాటకలోని గౌనిపల్లె, 25న విజయపుర, నందగుడి పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా అదే విధంగా నేరాలకు పాల్పడ్డారు. శ్యామ్, సాగర్ అనువారు దోపిడీ కేసులలో వాటాల గురించి ఈ నెల 9న పాణ్యం సమీపంలో గొడవ పడి సాగర్ పిస్టల్‌తో శ్యామ్‌ను కాల్చి చంపాడు. ఆ కేసులో సాగర్ నంద్యాల సబ్ జైలుకు వెళ్లాడు. సచిన్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడు. మిగిలిన ఆరుగురు షేక్ అబ్దుల్ రహమాన్, సయ్యద్ మహమ్మద్ హుస్సేన్, సయ్యద్ సలీం, షేక్ మస్తాన్, సయ్యద్ రఫీ, సయ్యద్ హుస్సేన్‌బాషా బుధవారం స్థానిక మదనపల్లె రోడ్డులో ఉండగా ఎస్ఐ బాలకృష్ణ తన సిబ్బందితో అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమాలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ధార్మిక సంస్థల ఆస్తుల పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ సయ్యద్ అహ్మద్‌బాషా పేర్కొన్నారు. గురువారం నగరంలోని రహమతీయ ఫంక్షన్ హాల్లో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రెండవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల భాష, సాంస్కృతిక, ఆర్థిక, విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధి, భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ధార్మిక కార్యక్రమాల కోసం దూరదృష్టితో పూర్వీకులు తమ ఆస్తులను వక్ఫ్ చేశారన్నారు. ఈ భూములను రక్షించి మైనార్టీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న వక్ఫ్ చేయబడ్డాయో ఆ ఉద్దేశాన్ని పాలకులు విస్మరించారని గుర్తు చేశారు. వక్ఫ్ బోర్డు అపరిమిత అధికారాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లుని తీసుకువచ్చిందన్నారు. ఈ బిల్లుపై ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. వక్ఫ్ భూముల్ని లాక్కోవడమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. అందులో భాగంగా 40 సవరణలు తీసుకొచ్చి బడా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రస్తుతం వక్ఫ్ బోర్డు ఆస్తులే కాకుండా భవిష్యత్తులో ఇతర ధార్మిక హిందూ, క్రిస్టియానిటీ సంస్థలకు చెందిన ఆస్తులను సైతం కైవసం చేసుకుంటారని ఆరోపించారు. మైనార్టీ కమ్యూనిటీలో ఈ బిల్లుపై భయాలు ఉన్నాయని, అయితే జేపీసీ పరిశీలనకు పంపాలన్న కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మైనారిటీలు చైతన్యవంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు చంద్రశేఖర్, మహమ్మద్ అలీఖాన్, అమీర్ బాబు, రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకుల దాడి

- ఇద్దరికి గాయాలు
- టీ దుకాణాన్ని ధ్వంసం చేసిన టీడీపీ వర్గీయులు
- మైదుకూరు రోడ్డులో హల్‌చల్ చేసిన ముక్తియార్ అనుచరులు



టీ దుకాణంలో దాడికి పాల్పడుతున్న టీడీపీ నాయకులు



మైదుకూరు రోడ్డులో ప్రధాన రహదారిలో టీడీపీ వర్గీయుల హంగామా



టీడీపీ వర్గీయులను పంపించేస్తున్న పోలీసులు



ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో ఆగిపోయిన బస్సు

ప్రొద్దుటూరు క్రైం : టీడీపీ నాయకుల దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన బండి గౌస్‌మొద్దీన్ అలియాస్ అవతార్, అబ్దుల్‌లకు గాయాలయ్యాయి. గురువారం రాత్రి టీడీపీ నాయకుడు ఖలీల్‌బాషా, మరికొందరు వెంటపడటంతో.. 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చాంద్‌బాషాకు చెందిన టీ దుకాణంలోకి వారు పరుగెత్తారు. అక్కడ కూడా వదలకుండా వారిపై దాడికి పాల్పడి టీ దుకాణాన్ని కూడా పూర్తిగా ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గౌస్‌మొద్దీన్ టీ దుకాణంలో పని చేస్తుండగా అబ్దుల్ టీ తాగేందుకు అక్కడికి వచ్చాడు. అదే సమయంలో టీడీపీ నాయయకుడు ఖలీల్‌బాషా మరి కొందరితో కలిసి అక్కడికి రాగా.. ఇరువురికి మాటకు మాట పెరిగి గొడవకు దారి తీసింది. తీవ్రంగా గాయపడిన గౌస్‌మొద్దీన్, అబ్దుల్‌లు ఫిర్యాదు చేసేందుకు టూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బంగారుమునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా స్టేషన్ వద్దకు వెళ్లారు. అయితే డీఎస్పీ భక్తవత్సలం సూచన మేరకు స్టేషన్ వద్ద నుంచి వారు వెళ్లిపోయారు. కొద్ది సేపటి తర్వాత టీఎస్ ముక్తియార్ తన అనుచరులతో కలిసి టూ టౌన్ వద్దకు వచ్చారు. ఆయన వెనకాలే పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు రావడంతో.. పోలీసులు స్టేషన్ ప్రధాన గేట్‌ను మూయడానికి ప్రయత్నించారు. అయితే పోలీసులను కూడా తోసుకొని టీడీపీ కార్యకర్తలు స్టేషన్‌లోకి దూసుకెళ్లారు. డీఎస్పీ భక్తవత్సలం, టూ టౌన్ సీఐ యుగంధర్‌లు ఎంత చెప్పినా ముక్తియార్ వినిపించుకోలేదు. తర్వాత స్టేషన్ నుంచి బయటికి వెళ్లిపోయారు. అయితే ముక్తియార్‌తోపాటు వందలాది మంది ఆయన వర్గీయులు మైదుకూరు రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి హంగామా చేశారు. పోలీసులు చెప్పినా వినిపించుకోలేదు. పెద్ద ఎత్తున జనం గుమికూడటంతో మైదుకూరు రోడ్డులో పూర్తిగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇక్కడి నుంచి వెళ్లాలని పోలీసులు టీడీపీ నాయకులను బతిమాలాల్సి వచ్చింది. కాగా టీడీపీ నాయకుడు ఖలీల్ కూడా తనపై గౌస్‌మొద్దీన్, అబ్దుల్ దాడి చేసినట్లు ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు.

